## వనపర్వ కథాంశాలు

వనపర్వమున 22 ఉపపర్వములు 11968 శ్లోకములు గలవు.

### 1. అరణ్యపర్వము :-

ఈ ఉపపర్వమున పది అధ్యాయములు గలవు. పాండవుల పంౘ్రెండు సంవత్సరముల వనవాసమును గూర్చి జనమేజయుడు అడగగా వైశంపాయనుడు ఆవృత్తాంతము చెప్పెను. పాండవులు వనవాసమునకు బయలుదేరగా పురప్రజలుకూడా వనములకు వారిని అనుసరించిరి. కాని యుధిష్ఠిరుడు అనునయించి వారిని వెనుకకు పంపెను. పాండవులు గంగఒడ్డున ప్రమాణమను పేరుగల మహావృక్షసమీపమున రాత్రి గడిపిరి. వారితోబాటు కొద్దిమంది బ్రాహ్మణులు కూడా గలరు. యుధిష్ఠిరుడు వారించినను వారు పాండవులతోబాటు ఉంటూ తమ అన్నవ్యవస్థను తామే చేసుకోనున్నట్లు తెలిసి విచారించెను. అప్పుడు సాంఖ్యకర్మయోగములలో కుశలుడగు బ్రాహ్మణశౌనకుడు వారి మానసిక శారీరక దుఃఖనివృత్తికై ఉపాయము చెబుతూ కౌంతేయా! 'సిద్ధపురుషులు తమతపః ప్రభావముచే అభీష్టమును సంపాదించుకొనగలరు. కనుక మీరు తపస్సును ఆలంబనముగా తీసుకొని మనోరథమును పూర్తి చేసుకొను'డని ఉపదేశించెను.

శౌనకుడు ఈ విధముగా పలుకగా ధర్మరాజు తనపురోహితుడు ధౌమ్యుని వద్దకు వెళ్ళి అతనితో ఈ బ్రాహ్మణులందరు నాతోబాటు వనములో ఉండవలె ననుకొనుచున్నారు. కాని ఈ సమయమున నాకు వారికన్నము పెట్టు శక్తిలేదు. ఇట్టి అవస్థలో నేనేమి చేయవలయునో సూచించవలసినదని విన్నవించెను. సమస్త ప్రాణి కోటికి జీవనాధారము సూర్యభగవానుడు - కనుక అతని శరణుపొందవలసినదని ధౌమ్యుడు సూచించెను. పురోహితుని ఉపదేశమునుసరించి యుధిష్ఠిరుడు సూర్యభగవానుని ఆరాధించి అక్షయపాత్రను పొందెను. బ్రాహ్మణులు, పురోహితుడు ధౌమ్యునితోకూడ పాండవులు కామ్యకవనమునకు వెడలిరి.

పాండవులు వనవాసమునకు వెడలిన తరువాత ధృతరాష్ట్రుడు

విదురుని కర్తవ్యము నిర్దేశించమని అడిగెను. విదురుడు ధర్మమార్గమున నడవమని ధృతరాష్ట్రునకుపదేశించెను. కాని ధృతరాష్ట్రుడు విదురుని వ్యవహారము తనపుత్రులకు

హితము కల్గించునది కాదని అనుకొని అతనితో విదురా! నీవు నాహితైషివి కావని నేటి నీ వ్యవహారమువలన తేలినది. నీవు నాకు అహితమగు సలహా ఇచ్చుచున్నావు. నీవు కోరినచోటుకు వెళ్ళిపోవలసినది' అని చెప్పి తన మందిరమునకు వెడలెను. కురుకులనాశము తప్పనిసరి అని పలికి విదురుడు పాండవుల వద్దకు వెళ్లెను. అతడు ధర్మరాజుతో ధృతరాష్ట్రుని వ్యవహారమును వివరించి ధర్మోపదేశమును గావించెను. ధర్మమును తప్పక పాలించెదనని ధర్మరాజు వక్కాణించెను. విదురుడు వెళ్లిపోవుటచే పశ్చాత్తాపమును బొందిన ధృతరాష్ట్రుడు అతనిని తీసుకొని రమ్మని సంజయుని ఆదేశించెను. మహారాజు ఆదేశమునుసరించి విదురుడు యుధిష్ఠిరుని అనుమతిబొంది తిరిగి హస్తినాపురమునకు వెళ్ళెను. తన అప్రియ వ్యవహారమునకు ధృతరాష్ట్రుడు క్షమించమని అడిగెను. ఇద్దరూ మిక్కిలి ప్రసన్నులైరి.

విదురుడు తిరిగి వచ్చుటవలన దుర్యోధనుడు ఖిన్నుడాయెను. దుర్యోధన, దుశ్శాసన, శకుని, కర్ణులు పరస్పరము చర్చించుకొని పాండవులను వధించుటకు తమ తమ రథములపై నగరము బయటకు వెడలిరి. వ్యాసమహర్షి దివ్యదృష్టితో అంతాచూచి వారిని వారించి ధృతరాష్ట్రుని వద్దకు వచ్చి దుర్యోధనుని అన్యాయపూర్ణవ్యవహారమును ఆపుచేయమని ఒత్తిడి చేసెను. ధృతరాష్ట్రుడు వ్యాసమహర్షితో ' మహర్షీ! ద్యూతక్రీడ నాకును ఇష్టములేదు. కాని మోహవశముచే అందరిని ద్యూతక్రీడయందు లగ్నముచేసితిని. నాపుత్రుడు దుర్యోధనుడు అవివేకియని నాకు తెలుసు. కాని పుత్రస్నేహమువలన అతనిని నేను విడిచిపెట్టలేకున్నాను'అని పలికెను. అంతట వ్యాసమహర్షి ధృతరాష్ట్రునితో పుత్రునిమించిన వస్తువు ఈ లోకమున మరియొకటి లేదు. కాని దయనీయస్థితిలో నున్న పుత్రులపై అధికకృప చూపించవలెను. ప్రస్తుతము పాండుపుత్రులు మిక్కిలి దయనీయస్థితిలోనున్నారు. కురువంశమంతయు క్షేమముగానుండవలెనన్న దుర్యోధనుడు పాండవులతో శాంతిపూర్వకముగానుండవలెనని ఉపదేశించెను. ఇంకను

మైత్రేయమహర్షి పాండవులను కలసి ఇక్కడకు వచ్చుచున్నారు. కులముయెక్క క్షేమముగూర్చి వారు తప్పక దుర్యోధనుని యధాయోగ్యముగ ఉపదేశించెదరు. అనిచెప్పి వ్యాసమహర్షి అక్కడినుండి వెడలెను. మైత్రేయమహర్షి అచ్చటకు వచ్చెను. ధృతరాష్ట్రుని విజ్ఞప్తి ననుసరించి మహర్షి దుర్యోధనునకు హితోపదేశముచేసెను. ఆసమయమున దుర్యోధనుడు మహర్షి వచనములయందు ఆసక్తిచూపక తనతొడను చేతితో కొట్టుచూ, పాదముతో భూమిపై రాయసాగెను. అతనిని చూచి కోపగించిన మహర్షి
నీఅనుచితవ్యవహారం కారణంగా పెద్దయుద్ధము జరుగగలదు. అందు గదాయుద్ధమున భీముడు నీతొడలు విరగగొట్టగలడని మైత్రేయుడు శపించెను. ధృతరాష్ట్రుడు వేడుకోగా మహర్షి శాంతిని అవలంబించిన శాపప్రభావముండదు. లేకున్న శాపమును తప్పక అనుభవించవించవలెనని చెప్పి అక్కడినుండి బయలుదేరెను. మైత్రేయునిద్వారా కిర్మీరవధ సమాచారమును విని దుర్యోధనుడు ఉద్విగ్నుడై బయటకు వెడలెను.

**2. కిర్మీరవధపర్వము :-**

ఇందు ఒక అధ్యాయముగలదు. ధృతరాష్ట్రుడు అడుగగా విదురుడు కిర్మీరవధవృత్తాంతమును వినిపించెను. ద్యూతమందు ఓడిన పాండవులు వనవాసమునకై బయలుదేరి కామ్యకవనము చేరిరి. ఆసమయమున కిర్మీరుడను నరభక్షకుడగు రాక్షసుడు వారి మార్గమును ప్రతిబంధించెను. భీమసేనుడు ఆ రాక్షసుని వధించెను. ఈ వృత్తాంతమును విన్న ధృతరాష్ట్రుడు చింతామగ్నుడాయెను.

**3. అర్జునాభిగమన పర్వము :-**

ఈ ఉపపర్వమున 26 అధ్యాయములు గలవు. పాండవుల వనవాసవృత్తాంతమును విని దుఃఖితులైన పాంచాల , కేకయ, వృష్ణి, అంధకవంశవీరులు యుధిష్ఠిరుని కలియుటకు వెళ్ళిరి. శ్రీకృష్ణుడు రాజులతో 'యుద్ధమున దుర్యోధనాదులను ఓడించి యుధిష్ఠిరునికి తిరిగి రాజ్యాభిషేకము చేయవలెను. ఇతరులను మోసగించి

సుఖములననుభవించు వ్యక్తిని తప్పక చంపవలెను. ఇది సనాతన ధర్మము అని వచించెను. కుంతీపుత్రుల అపమానమునకు క్రుద్ధుడైన శ్రీకృష్ణుని శాంతింపజేసి అర్జునుడు అతని పూర్వకృత్యములను స్తుతించెను. శ్రీకృష్ణుడు అర్జునునితో పార్థా! నీవు నరుడవు. నేను నారాయణుడను. నరనారాయణఋషులు ఇపుడు ఈ లోకమునకు వచ్చిరి. మనమిద్దరమూ ఒక్కటే. ఇద్దరి భేదము తెలుసుకోబడదని చెప్పెను. ద్రౌపది తనకు జరిగిన అవమానమును, దుఃఖమును తెలియజేస్తూ శ్రీకృష్ణునితో హే ప్రభో! మీరు మాకు సంబంధించినవారు, నేను గౌరవముతో కూడిన దానిని. మీ సఖురాలను. నన్ను రక్షించుటకు మీరే సమర్థులని పలికెను. అదివిని శ్రీకృష్ణుడు ద్రౌపదిని ఊరడించెను. శ్రీకృష్ణుడు

యుధిష్ఠిరునితో రాజా! ద్యూతక్రీడ సమయమున నేను ద్వారకలో, లేక సమీపమునన్నుచో, కౌరవులు పిలువకపోయినను ద్యూతసభకు వచ్చి ద్యూతముయొక్క దోషములనుచూపి దానిని ఆపుటకు ప్రయత్నము చేసి ఉండెడివాడిని. ద్వారకకు వచ్చిన పిమ్మట సాత్యకివలన విషయము తెలిసి వెంటనే మిమ్ములను కలియుటకు వచ్చితిని. శ్రీకృష్ణుడు ఆసమయమున ద్వారకయందు లేకపోవుటకు శాల్వుని చంపుటకు వెళ్ళుట కారణమని చెప్పెను. యుధిష్ఠిరుని అనుజ్ఞను పొంది శ్రీకృష్ణధృష్టద్యుమ్నులు మరికొందరు రాజులు తమ తమ నగరములకు బయలుదేరిరి.

పాండవులు కామ్యకవనమునుండి ద్వైతవనమునకు బయలుదేరి వెళ్ళిరి. మార్కండేయమహర్షి పాండవుల ఆశ్రమమునకు విచ్చేసి వారికి ధర్మోపదేశముగావించి అటునుండి ఉత్తర దిక్కునకు బయలుదేరి వెళ్ళెను. ఒకరోజున పాండవులు సాయంకాలమున ద్రౌపదితోబాటు కూర్చొని విచారముతో పరస్పరము మాటలాడుకొనుచుండిరి. ఆసమయమున ద్రౌపది ధర్మరాజుతో రాజా! దురాత్ముడగు దుర్యోధనుడు మనల్ని దుఃఖితుల్ని చేసి సుఖముల ననుభవించుచున్నాడు. నేను ద్రుపదవంశములో పుట్టినదానిని. పాండురాజుకోడలిని. ధృష్టద్యుమ్నుని సోదరిని. పాండవుల ధర్మపత్నిని. ఇటువంటి నేను కష్టములననుభవించుచుండగా మీరు శత్రువులయెడ దయచూపుట తగదు. సమయము వచ్చినపుడు శత్రువులపై తమ పరాక్రమము చూపని

క్షత్రియుని అందరూ తిరస్కరించెదరు. కనుక రాజా! కౌరవులయెడల తమపరాక్రమము చూపుటకు సమయము ఆసన్నమైనది. ఇది నా అభిప్రాయమని పలికెను. ద్రౌపదిమాటలను విన్న యుధిష్ఠిరుడు క్రోధమును నిందిస్తూ సహనమును ప్రశంసించెను. ద్రౌపది యుధిష్ఠిరుని వచనములను ఆక్షేపించెను. యుధిష్ఠిరుడూ తిరిగి సయుక్తికముగా ద్రౌపది ఆక్షేపమునకు సమాధానము చెప్పెను. కర్తవ్యపాలన చేయుమని ద్రౌపది యుధిష్ఠిరునికి ఉపదేశించెను. భీమసేనుడుకూడా ద్రౌపదిమాటలను సమర్థిస్తూ ధర్మరాజును యుద్ధమునకు ప్రోత్సహించెను. కాని ధర్మరాజు భీమసేనుని ఒప్పించుటకు ప్రయత్నించెను. ఇంతలో వ్యాసమహర్షి అక్కడకు వచ్చెను. అతడు ధర్మరాజుతో నేను ప్రతిస్మృతి అనుపేరుగల విద్యను నీకు ఉపదేశించెదను. నీనుండి ఆవిద్యను అర్జునుడు పొంది సకలకార్యములను సాధించగలడు. దివ్యాస్త్రములను పొందుటకు అర్జునుడు ఇంద్రరుద్రాదులవద్దకు వెళ్ళవలసినదని చెప్పి ధర్మరాజునకు ప్రతిస్మృతి విద్యను ఉపదేశించి
అంతర్ధానమాయెను. వ్యాసుని ఆజ్ఞననుసరించి పాండవులు ద్వైతవముునుండి తిరిగి కామ్యకవనమునకు వెడలిరి.

కొంతసమయమునకు యుధిష్ఠిరుడు అర్జునునితో ఏకాంతమున సంభాషించి దివ్యాస్త్రప్రాప్తికై ఇంద్రునివద్దకు వెళ్ళమని సలహా ఇచ్చి. ప్రతిస్మృతిని ఉపదేశించెను.. సోదరుని ఆదేశముననుసరించి అర్జునుడు ఇంద్రకీల పర్వతముజేరి ఇంద్రుని చూచెను. ఇంద్రుడు అర్జునునితో శివునిదర్శనము చేసుకొమ్మని పిమ్మట దివ్యాస్త్రములను ఇచ్చెదనని చెప్పి అదృశ్యమాయెను.

**4. కైరాత పర్వము :-**

ఇందు నాల్గు అధ్యాయములుగలవు. మహాదేవుని దర్శనము కొఱకు అర్జునుడు హిమాలయ సమీపమున నిర్జన వనమున ఘోరతపస్సు నాచరించెను. అర్జునుని తపస్సును గూర్చి మహర్షులు పరమేశ్వరునికి తెలియజేసిరి. శంకరుడు అర్జునుని సంకల్పమును పూర్తి చేసెదనని చెప్పెను. పిమ్మట పరమేశ్వరుడు కిరాత వేషమును ధరించి అర్జునుడు తపస్సు చేస్తున్న ప్రదేశమునకు వెళ్ళెను. పరమేశ్వరునితో పార్వతి,

భూతగణము కూడా వెడలిరి. అచ్చట మూకుడను రాక్షసుడు వరాహ వేషమును ధరించి అర్జునుని చంపు ఆలోచన చేయుచుండెను. వరాహమును లక్ష్యముగా చేసుకొని శంకరుడు, అర్జునుడు ఇరువురు ఒక్కసారిగా బాణము వేసి దానిని చంపిరి. దాని విషయమున ఇరువురి మధ్య యుద్ధము జరిగెను. అర్జునుడు కిరాత వేషధారియగు పరమేశ్వరునిపై మర్మ భేదులగు అనేక బాణములను ప్రయోగించెను. కాని అవన్నియు నిష్ఫలమాయెను. పిమ్మట వారద్దరి మధ్య బాహు యుద్ధము జరిగెను. చివరకు కిరాతుని శంకరునిగా తెలుసుకొని అర్జునుడు అతని పాదములపై పడి ప్రసన్నుని చేసుకొనెను. పరమేశ్వరుడు ప్రసన్నుడై అతనికి గాండీవ ధనుస్సు నిచ్చి పార్వతితో స్వస్థానమునకు వెళ్ళెను. అభీష్టసిద్ధియగుటచే అర్జునుడు మిక్కిలి సంతోషించెను. కుబేరాది దిక్పాలకులు అక్కడికి వచ్చి అతనికి అనేకములగు దివ్యాస్త్రములనిచ్చిరి. ఇంద్రుడు దివ్యాస్త్రలము కొఱకు స్వర్గమునకు రమ్మనమని అర్జునునికి చెప్పెను.

**5) ఇంద్రలోకాభిగమన పర్వము :-**

ఇందు పది అధ్యాయములుగలవు. దిక్పాలకులు వెడలిన తరువాత అర్జునుడు ఇంద్రరథమును స్మరించెను. రథసారథియగు మాతలితో కూడా దివ్యరథము అచ్చటకు వచ్చెను. అర్జునుడు మాతలితో కూడా అమరావతి చేరి తండ్రి దేవేంద్రుని చూచి మిక్కిలి సంతోషించెను. తన తండ్రి ఇంటి వద్దనే ఉండి అర్జునుడు అస్త్రవిద్యను నేర్చుకొనెను. తండ్రి ఆదేశము ప్రకారము అతడు అయిదు సంవత్సరములు అచ్చటనే ఉండెను. అస్త్రవిద్యయందు నైపుణ్యము సంపాదించి అర్జునుడు తండ్రి సూచన ననుసరించి చిత్రసేనుని వలన నృత్య గీతవిద్యను పొందెను.

ఒక రోజున అర్జునుడు ఊర్వశి యందు అనురక్తుడైనట్లు ఇంద్రుడు గ్రహించి చిత్రసేనుని పిలిచి అతనితో అర్జునుని స్త్రీసంగ విశారదుని చేయుటకు ఊర్వశిని అతని వద్దకు పంపమని ఆదేశించెను. ఊర్వశి చిత్రసేనుని ద్వారా అర్జునుని గుణగణములను విని ఆకృష్టురాలై ఇంద్రుని ఆదేశానుసారము అతని వద్దకు వెళ్ళెను. తన మనస్సులోని ప్రేమభావమును ఆమె వ్యక్తము చేయగా అర్జునుడు వరవర్ణిని! నా

దృష్టిలో నీవు నాకు తల్లివలె పూజనీయురాలివి. పుత్రునివలె నన్ను నీవు పాలించదగిన దానివని పలికెను. అతని మాటలు విని కోపగించిన ఊర్వశి స్త్రీల మధ్య గౌరవహీనుడవై నర్తకునిగా ఉంటూ నపుంసకునిగా పిలవబడతావు. నీచేష్టలన్నీ నంపుంసకునివలె ఉండునని అర్జునుని శపించెను. శాపవృత్తాంతము తెలుసుకొన్న ఇంద్రుడు తన పుత్రుడగు అర్జునునితో ఈ శాపము నీ అభీష్టసిద్ధి కొఱకు ఉపయోగించును. అజ్ఞాత వాసమున నపుంసక భావముతో నర్తకునిగా ఒక సంవత్సరము కాలయాపన చేసి తిరిగి పురుషత్వమును పొందెదవని చెప్పను.

ఒక రోజున లోమశమహర్షి లోకములు తిరుగుచు ఇంద్రుని కలియుటకు స్వర్గమునకు వచ్చెను. అచ్చట ఇంద్రుని అర్థ సింహాసనముపై కూర్చొనియున్న అర్జునుని చూచి అతని మనస్సున ఇతడెవరని సందేహము కల్గినది. ఇంద్రుడు మహర్షితో కుంతీ గర్భమునుండి పుట్టిన ఇతడు నా కొడుకు. నర నారాయణులుగా ప్రసిద్ధిగాంచిన పురాతన మునీశ్వరులే దేవతల కార్యసిద్ధికొఱకు భూలోకమున కృష్ణ అర్జునులుగా అవతరించిరి. ఇచ్చటి నివాతకవచులను రాక్షసులను చంపి తిరిగి మనుష్య లోకమునకు తిరిగి వెళ్ళగలడు. మహర్షీ! భూలోకములో కామ్యక వనమున యుధిష్ఠిరుని కలిసి అస్త్రవిద్యను నేర్చుకొని అర్జునుడు త్వరలో మీవద్దకు తిరిగిరాగలడని నాసందేశమును వినిపించవలసిన దని చెప్పెను. లోమశ మహర్షి ఇంద్రుని సందేశము తీసుకొని కామక్యవనమున ధర్మరాజును కలిసెను.

మహారాజు ధృతరాష్ట్రుడు వ్యాసుని వలన అర్జునుని ఇంద్రలోక గమన సమాచారము విని మిక్కిలి వ్యథచెంది తన పుత్రుల గూర్చి ఆలోచిస్తూ సంజయునితో హే సూత! దుష్ట వ్యవహారముచే నాపుత్రులు మృత్యువుకు దగ్గర అయిరి.

అస్త్రవిద్యా సంపన్నుడైన అర్జునుని ఎవరు జయించగలరు? అని అడిగెను. అప్పుడు సంజయుడు రాజా! మీరు దుర్యోధనుని గూర్చి చెప్పినదంతా యథార్థము. అర్జునుడు తన తపఃప్రభావముచే ఈశ్వరుని మెప్పించెను. ద్రౌపది పరాభవముచే వ్యథ చెందిన పాండవులు యుద్ధమున నీపుత్రులను తప్పక చంపెదరు. ధృతరాష్ట్రుడు సంజయుని మాటలను అంగీకరిస్తూ విచారించెను.

6) నలోపాఖ్యాన పర్వము:-

ఇందు ఇరువది ఎనిమిది అధ్యాయములు గలవు. అస్త్ర విద్యను పొందుటకు అర్జునుడు ఇంద్రలోకమునకు వెడలగా కామ్యకవనమున పాండవులు ద్రౌపదితో కూడా అర్జునుని గూర్చి చర్చించుకొనుచుండిరి. ఒక రోజున భీముడు యుధిష్ఠిరునితో సోదరా! తమ ఆదేశము ప్రకారము దివ్యాస్త్రములను పొందుటకు అర్జునుడు తపస్సు చేయటకై వెళ్ళినాడు. బాహు బలసంపన్నులగు మనము శ్రీకృష్ణుని సహాయంతో శత్రువులను చంపుటకు సమర్థులము. ద్యూత క్రీడ వలన మనం దీనుల మైతిమి. ఈవిధమగు దుఃఖములనుభవించుచూ వనవాసము చేయుట క్షత్రియ ధర్మము కాదు. ధర్మజ్ఞులు పగలు రాత్రి కలిసి ఒక సంవత్సరముగా చూచెదరు. వైదిక వచనము ననుసరించి కృచ్ఛ్రవ్రతము ఆచరించిన ఒక సంవత్సరము పూర్తియగును. పదమూడు రోజుల తరువాత పదమూడు సంవత్సరములు పూర్తి అయినట్లు మీరు తెలుసుకోండి. కనుక మీరు వేదోక్త ధర్మమును పాలించవలసినదని పలికెను. అతని మాటలు విన్న యుధిష్ఠిరుడు భీముని శాంతింపజేస్తు భీమా! నీవు అర్జునుని తో కలసి దుర్యోధనుని చంపగలవు. ఇందులో అణుమాత్రము సందేహము లేదు. కాని దుర్యోధనుని చంపు సమయము ఇంకా రాలేదని చెప్పుచుండగా మహర్షి బృహదశ్వుడు అక్కడికి వచ్చెను. అతిధి సత్కారముల పిమ్మట ధర్మరాజు ద్యూత వృత్తాంతము చెప్పి తాను భాగ్యహీనుడ నని చెప్పెను. అంతట బృహదశ్వుడు ధర్మరాజు కంటె భాగ్యహీనుడు నలమహారాజని చెప్పి అతని చరిత్రను వినిపించెను. స్వయంవరమున దమయంతి నలుని తనభర్తగా వరించినది. ఇంద్రునివలన దమయంతీ స్వయంవరము విని ఆమె

యెడల అనురక్తుడయిన కలి మిక్కిలి కోపగించి నలునిలో ప్రవేశించెను. కలిప్రభావముచే ద్యూతక్రీడయందు పుష్కరుని చేతిలో ఓడిపోయి దమయంతితో కూడా వనమునకు వెడలెను. ఆకలిచే పీడింపబడిన నలుడు కొన్ని పక్షులను భక్ష్యములుగా తలచి వానిపై తన వస్త్రమును విసిరెను. కాని పక్షులన్నీ ఆవస్త్రమును తీసుకొని ఆకాశమున ఎగిరి పోయినవి. ఒంటి మీద వస్త్రము లేక దుఃఖించిన నలుడు నిద్రించుచున్న దమయంతి యొక్క అర్ధ వస్త్రమును చింపి తన శరీరము కప్పుకొని ఆమెను విడిచి

వెళ్ళిపోయెను. చివరకు నలుడు పుష్కరుని ద్యూతమున ఓడించి రాజ్యమును తిరిగి పొందెనని చెప్పి మహర్షి యుధిష్ఠిరునికి ధైర్యము చెప్పి అతనికి ద్యూతవిద్య, అశ్వవిద్య రహస్యములను చెప్పెను.

**7) తీర్థయాత్రా పర్వము :-**

ఇందు 77 అధ్యాయములు గలవు. అస్త్రవిద్యను పొందుటకు అర్జునుడు కామ్యక వనం నుండి వెళ్ళినప్పటినుండి పాండవులు చింతతోనుండిరి. ఒక రోజున నారద మహర్షి అచ్చటకు వచ్చెను. అతిథి మర్యాదల పిమ్మట యుధిష్ఠిరుడు మహర్షిని తీర్థయాత్రల ఫలమును అడిగెను. భీష్ముడు, మహర్షి పులస్త్యుని ద్వారా వినిన తీర్థయాత్రల మాహాత్మ్యమును నారద మహర్షి వారికి వినిపించెను. భీష్ముడు అడుగగా పులస్త్య మహర్షి అతనితో మనుష్య లోకమున బ్రహ్మగారి త్రిలోక విఖ్యాతమగు పుష్కరతీర్థ మొకటి గలదు. భాగ్యవంతులే అందు ప్రవేశించగలరు. మూడు కాలములలోను ఇందు పది వేలకోట్ల తీర్థములు నివాసముండును. అచ్చట పండ్రెండు రాత్రులు గడిపి పిమ్మట జంబూమార్గమను తీర్థమునకు వెళ్ళవలెనని ఈవిధముగా సకల తీర్థముల మాహాత్మ్యమును పెర్కొనెను.

అటు పిమ్మట లోమశమహర్షి అచ్చటకు వచ్చి అర్జునుని పాశుపతము మున్నగు దివ్యాస్త్రములను వర్ణించి ఇంద్రుని సందేశమును వినిపించెను. అర్జునుని కుశలసమాచారము తెలుసుకొని పాండవులు మిక్కిలి సంతోషించి తీర్థయాత్రలకు బయలుదేరిరి. వారు నైమిశారణ్యము,గోమతి మున్నగు తీర్థములు వెళ్ళి అక్కడి నుండి ప్రయాగ గయాతీర్థము వెళ్ళిరి. గయనుండి అగస్త్యాశ్రమము చేరిరి. యుధిష్ఠిరుని ప్రశ్నకు బదులుగా లోమశుడు అగస్త్యముని యొక్క వాతాపినాశవృత్తాంతమును చెప్పెను. వజ్రాయుధము కొఱకు దధీచి మహర్షి తన వెన్నెముకను ఇచ్చుట,
వృత్రాసురవధ, అగస్త్య మహర్షి వింధ్య పర్వతము పెరగకుండా నిలుపు చేయుట, అగస్త్యుని సముద్రపానము, సగర పుత్రుల ఉత్పత్తి, ఋష్యశృంగవృత్తాంతము మున్నగునవి వివరించెను. తదనంతరము ధర్మరాజు పాండవులతో బాటు కౌశిక, గంగా,వైతరణి మున్నగునదులను

దర్శించెను. ఆ తరువాత వారు మహేంద్ర పర్వతము చేరి ఆరాత్రి అక్కడ గడిపిరి. పరశురామ సేవకుడగు అకృతవ్రణుడు పరశురాముని మహత్త్వపూర్ణకర్మలను ధర్మరాజునకు వినిపించెను. అచ్చటి నుండి పాండవులు ప్రభాస తీర్థమునకు వెళ్ళిరి. అచ్చట యాదవులు వారిని కలిసిరి. తీర్థయాత్రల సమయమున ద్రౌపది అలసిపోయి మూర్ఛపోయెడిది. యుధిష్ఠిరుని ఆదేశము ననుసరించి భీముడు తన కొడుకగు ఘటోత్కచుడు తల్లి ద్రౌపదిని, మిగిలిన రాక్షసులు పాండవులను తమ తమ భుజములపై కూర్చుండ బెట్టుకొని తీసుకు వెళ్ళిరి. వారు బదరికావనమును చేరిరి. ద్రౌపది అడుగగా భీముడు సౌగంధిక పుష్పములు తీసుకొని వచ్చుటకు బయలు దేరెను. ఆసమయమున భీముడు హనుమంతుని చూసెను. సౌగంధిక వనమున రాక్షసులను ఓడించి భీముడు సౌగంధిక పుష్పములను తీసుకు వచ్చెను. పిమ్మట ఆకాశవాణి ననుసరించి పాండవులు నరనారాయణ స్థానమయిన బదరికాశ్రమము చేరిరి. నారాయణ స్థానమునకు వెళ్ళిరి.

**8) జటాసుర వధ :-**

ఈ ఉప పర్వమున ఒక అధ్యాయము మాత్రము గలదు. అర్జునుని రాకను నిరీక్షిస్తూ గంధమాదన పర్వతము మీద పాండవులు నివసించసాగిరి. ఒక రోజున భీమసేనుడు దగ్గర లేని సమయమున జటాసురుడను రాక్షసుడు ద్రౌపదితో సహా పాండవుల నపహరించెను. రాక్షసుని పట్టునుండి తప్పించు కున్న సహదేవుడు భీముడు వెళ్ళిన మార్గము ననుసరించుచు భీముని గట్టిగా పిలువసాగెను. భీమసేనుడు రాక్షసునితో యుద్ధము చేసి అతనిని సంహరించెను.

**9) యక్ష యుద్ధపర్వము:-**

ఇందు ఏడు అధ్యాయములుగలవు. జటాసుర వధ పిమ్మట పాండవులు నరనారాయణ ఆశ్రమమున ఉండిరి. పాండవులు తీర్థయాత్ర ప్రారంభించి నాల్గు
సంవత్సరములు పూర్తి అయ్యెను. అయిదవ సంవత్సరమున అర్జునుడు

అస్త్రవిద్యను పూర్తి చేసుకొని రావలసియున్నది. అందరూ అతని రాకను నిరీక్షించసాగిరి. పాండవులు అచ్చట వృషపర్వుని ఆశ్రమమునకు వెళ్ళి అతనిని కలిసిరి. అతని అనుమతి పొంది పాండవులు ఉత్తరదిక్కునకు బయలుదేరి హిమాలయ పర్వతము చేరిరి. ఆర్ష్టిషేణుని అనురోధముచే పాండవులు అచ్చటనే ఉంటూ అర్జునుని రాకను నిరీక్షించసాగిరి. అక్కడ ఉంటూ ఉంటూ పాండవుల అయిదవ సంవత్సరము పూర్తి అయినది. ద్రౌపది వచనము ననుసరించి భీముడు పర్వత శిఖరము చేరి యక్ష రాక్షసులతో యుద్ధము చేసి వారిని పారద్రోలి మణిమంతుడను రాక్షసుని చంపెను.

గంధమాదన పర్వతము మీద ఉంటూ పాండవులు అర్జునుని రాకను ఉత్కంఠతో నిరీక్షించ సాగిరి. అర్జునుడు ఇంద్రభవనమున అయిదు సంవత్సరములు ఉండి ఇంద్రుని నుండి దివ్యాస్త్రములను పొంది తండ్రి అనుమతితో సోదరులను కలియుటకు అర్జునుడు గంధమాదన పర్వతము చేరెను.

**10) నివాత కవచయుద్ధ పర్వము:-**

ఈ ఉప పర్వమున పదకొండు అధ్యాయములు గలవు. ఇంద్రుని దివ్య రథముపై కూర్చొని అర్జునుడు మాతలితో కూడా గంధమాదన పర్వతమును చేరెను. సోదరులు పరస్పర సమాగమముతో సంతోషించిరి. మాతలి పాండవులకు అభివాదనము చేసి కర్తవ్యము నుపదేశించి తిరిగి ఇంద్రలోకమునకు వెళ్ళెను. ఇంద్రుడు కూడా పాండవులవద్దకు వచ్చి యుధిష్ఠిరుని వద్ద అర్జునుని ప్రశంసించి సానందముగ స్వర్గలోకమునకు వెళ్ళెను. అర్జునుడు తన అనుభవములను విస్తృతముగ వర్ణించెను. నివాతకవచ రాక్షసులను చంపిన విధానమును వర్ణించెను. యుధిష్ఠిరుని కోరిక ప్రకారము అర్జునుడు దివ్యాస్త్రములను చూపుటకు ఏర్పాట్లు చేయుచుండగా నారదుడు అడ్డుతగిలి దివ్యాస్త్రములను అనుచితముగ ప్రయోగించిన మహా దోషము కల్గునని వారించెను. ద్రౌపదితో కూడి పాండవులందరు సంతోషముగా వనమున నుండ సాగిరి.

**11) ఆజగర పర్వము :-**

ఇందు ఆరు అధ్యాయములు గలవు. పాండవుల వన వాసము తీర్థయాత్రలరూపమున ఆనంద పూర్వకముగా పది సంవత్సరములు పూర్తి అయ్యెను భీమసేనుడు యుధిష్ఠిరుని తో  రాజా! మన వనవాసము పదకొండవ సంవత్సరము జరుగుచున్నది.

అజ్ఞాతవాసము కూడా నిరభ్యంతరముగా పూర్తిచేయగలము. అది పూర్తి అయిన పిమ్మట దుర్యోధనుని అంతము చేసెదము. కనుక  రాజా! శత్రువులను దండించుటకు నిశ్చయము చేసుకొనుడని పలికెను. అందరి అభిప్రాయములు తెలుసుకొని యుధిష్ఠిరుడు గంధమాదనమునకు ప్రణామమాచరించి అచ్చటి నుండి ద్వైతవనమునకు వెడలెను. ఆ భయంకర అరణ్యమున నిర్భయముగా తిరుగు భీమసేనుడు భారీ శరీరముగల అజగరము (కొండ చిలువ) ను చూచెను. ఆసర్పము అతనిని సమీపించి అతని రెండు బాహువులను గట్టిగా పట్టెను. భీమసేనుడు దానిని ఓడించ లేకపోయెను. ఆ సర్పము భీమునికి పూర్వ జన్మవృత్తాంతము వినిపించెను. రాజర్షి నహుషుడు అగస్త్యుని శాపము వలన అజగరమాయెను. అది భీముని ఆహారముగా స్వీకరింపదలచెను. యుధిష్ఠిరుడు ధౌమ్యమహర్షితో భీముని వెదకుచు బయలుదేరి ప్రస్తుత సంఘటన స్థలమునకు వచ్చెను. యుధిష్ఠిరుడు నహుషుని ప్రశ్నలకు సముచిత సమాధానమిచ్చెను. ఉచిత సమాధానము పొంది సంతోషించిన సర్పధారియగు నహుషుడు భీముని విడిచి శాపముక్తుడై స్వర్గము చేరెను.

## 12. మార్కండేయ సమాస్యాపర్వము

ఈ ఉపపర్వమున 51 అధ్యాయములు గలవు. పాండవులు ద్వైతవనమునుండి తిరిగి కామ్యకవనమునకు వెళ్ళిరి. సత్యభామాసహితుడై శ్రీకృష్ణుడు పాండవులను చూచుటకు అచ్చటకు వచ్చెను. శ్రీకృష్ణుడు యుధిష్ఠిరునికి ధర్మరాజా! అచిరకాలముననే నీమనోరథము నెరవేరును. వనవాసప్రతిజ్ఞ పూర్తి అయినవెంటనే కౌరవులను దండించుటకు మేము సిద్ధంగా ఉన్నామని ధైర్యము చెప్పెను. యుధిష్ఠిరుడు వాసుదేవా! ప్రతిజ్ఞననుసరించి నిర్జనవనములలో తిరుగుచు పంౘ్రెండుసంవత్సరములు వనవాసము పూర్తిచేసితిమి.

అజ్ఞాతవాసముపూర్తి అయినపిదప మేము నీ ఆధీనములోనుండెదమని శ్రీకృష్ణునితో పలికెను. ఆసమయమున మార్కండేయ మహర్షి అచ్చటకు వచ్చెను. శ్రీకృష్ణభగవానుడు, పాండవులు అతనిని సత్కరించిరి. నారదమహర్షికూడా పాండవులను కలియుటకు అక్కడకు వచ్చెను. ప్రాచీనకాలమునకు
సంబంధించిన పుణ్యకథలను వినిపించమని శ్రీకృష్ణుడు మార్కండేయ మహర్షిని కోరెను. యుధిష్ఠిరుడు మహర్షిని జీవుడు శరీరము విడిచి పరలోకము చేరిన తరువాత శుభ అశుభకర్మలు అతనిని ఎట్లుచేరును? మరణించినపుడు అతని కర్మలకు ఆశ్రయమేది? అని ప్రశ్నించెను. సమాధానముగా మహర్షి ఇట్లుపలికెను. ధర్మరాజ! మొట్టమొదట ప్రజాపతి బ్రహ్మ ఆవిర్భవించెను, వారు జీవులకు నిర్మలమైన, విశుద్ధమైన శరీరమును తయారుచేసిరి. పిమ్మట ధర్మశాస్త్రములను ప్రకటింపజేసెను. మొదట మనుష్యులందరు బ్రహ్మస్వరూపులు, పుణ్యాత్ములు, చిరంజీవులు. ఇచ్ఛానుసారము జీవించగలరు, మరణమును పొందగలరు. వారు ధర్మములన్నిటిని ప్రత్యక్షముగా చూడగలరు. జితేంద్రియులు, ఈర్ష్యలేనివారు. తరువాత కామక్రోధములకు వశమై ఛల, కపట, దంభములతో జీవికసాగించిరి. తమ అశుభపాపకర్మల ఫలానురూపము పశుపక్ష్యాది జన్మను, నరకమును పొందెడివారు. పాపాత్ముల ఆయుర్దాయము వారి కర్మలననుసరించి క్షీణించినది. మరణించిన పిమ్మట జీవులగతి వారి వారి కర్మలననుసరించి యుండును. ఈశ్వరదత్తమగు శరీరము ద్వారా శుభాశుభకర్మలను ప్రోగుచేసుకొని ఆయుర్దాయము పూర్తి అయిన స్థూలశరీరమును విడిచి అదేక్షణమున మరియొక ఉత్పత్తిస్థానమున ప్రవేశించును. రెండవస్థూలశరీరమున పూర్వజన్మలోని కర్మలు ఛాయమాదిరిగా అనుసరించియుండును. కనుక జీవుడు సుఖములేక దుఃఖము అనుభవించుటకు తిరిగి జన్మించుచున్నాడు. కర్మఫలమును తప్పించుకొనుట ఎవ్వరికీ సాధ్యముగాదు. మహాత్ములు, ఋషులు ఈ కర్మభూమికి వచ్చి తిరిగి దేవలోకమునకు పోవుదురు. **ధర్మపూర్వకముగా అర్థకామములను సంపాదించువాడు ఇహపరలోకములలో సుఖమును పొందగలడు.** ధర్మరాజ! చింతించకుము. ఈ కష్టములు నీ రాబోవుసుఖములకు సూచకములు. ఈసందర్భమున

మార్కండేయుడు అనేక కథలను వినిపించెను. వైవస్వత మనువు చరిత్ర, మత్స్యావతారకథను వివరించెను. వృష్ణికులభూషణుడగు శ్రీకృష్ణుడే పురాణపురుషుడు శ్రీహరియని మహర్షి చెప్పెను. యుధిష్ఠిరుడు అడుగగా కల్కి అవతారమును వర్ణించెను. మార్కండేయుని ధర్మోపదేశములకు శ్రీకృష్ణుడు, పాండవులు సంతసించిరి. ధర్మజుడు మార్కండేయమహర్షిని పతివ్రతా మాహత్మ్యమును గురించియు, మాతాపితృసేవను గురించియు ప్రశ్నించెను. అపుడు మహర్షి పాతివ్రత్యముచే అప్రత్యక్ష విషయములను సయితము తెలిసికొన గల్గిన పతివ్రత చరిత్రను, అట్లే మాతా పితృసేవనముచే పూర్వజన్మ స్మృతిని సయితము పొందిన వ్యాధుని చరిత్రమును తెలిపెను. ఈ
సందర్భముగా మహర్షి పాతివ్రత్య స్వరూపమును, ధర్మ సూక్ష్మమును, హింసాహింసల వివేచనమును, బ్రహ్మవిద్యస్వరూపమును పంచభూతముల, త్రిగుణముల స్వరూపమును, పరమాత్మ సాక్షాత్కారమునకు ఉపాయమును వివరించినాడు. వన పర్వములో ధర్మరాజుకు చెప్పిన ధర్మ విశేషములలో ఈ ఉప పర్వము ఈ విషయమై ప్రాధాన్యమును సంతరించుకొన్నది.

## 13. ద్రౌపదీ సత్యభామాసంవాదపర్వము:-

ఇందు మూడు అధ్యాయములు గలవు. ఒకవైపు కూర్చొని పాండవులు బ్రాహ్మణులు ధర్మచర్చ చేయుచుండగా మరొకవైపు సత్యభామాద్రౌపదులు హాస్యవినోదము చేయసాగిరి. పాండవులు నిరంతరము నీ అధీనమై ఉండుటకు కారణమేమని సత్యభామ ద్రౌపదిని ప్రశ్నించెను. ఆసందర్భమున సత్యభామ ద్రౌపదీ! శ్రీకృష్ణుడు నిరంతరము నాఆధీనమున ఉండుటకు సౌభాగ్యవృద్ధికారకములగు పద్ధతులు చెప్పుమని ద్రౌపదిని అడిగెను. ఇదివిని ద్రౌపది ఓ సత్యభామ! నీవుఅడుగు నది సాధ్వీస్త్రీలకు కాదు. దురాచారులగు స్త్రీలకు సంబంధించినది. స్వామివిషయమున సందేహించుట నీవంటి సాధ్వులకు ఉచితము గాదు. నేను పాండవులకు సేవ చేసెదను. భర్తల అభిప్రాయం ప్రకారం నడుచుకొందును. వారికి హితము చేయుటయందే నా మనస్సు లగ్నమైయుండునని హితము పలికెను. ద్రౌపది యొక్క ధార్మిక

వచనములు విని సత్యభామ సిగ్గుపడి క్షమించమని అడిగెను.

పతిని అనన్యభావముతో సేవించుటయే అతనిని అనుకూలుని చేసుకొనుటకు ఉపాయమని ద్రౌపది సత్యభామకు ఉపదేశించెను. శ్రీకృష్ణుడు పాండవుల వద్ద సెలవు తీసుకొని సత్యభామతో కూడా ద్వారకకు వెళ్ళెను.

## 14) ఘోషయాత్రా పర్వము:-

ఈ ఉపపర్వమున 22 అధ్యాయములు గలవు. పాండవులు ద్వైతవనమున ఒక కుటీరము నిర్మించుకొని అందు నివసించ సాగిరి. ఒక నాడు బ్రాహ్మణులు పాండవుల వద్దకు వచ్చి పిమ్మట దేశ భ్రమణము చేయుచు ధృతరాష్ట్రుని వద్దకు వెళ్ళిరి. మహారాజు అడుగగా పాండవులు కష్టముల ననుభవించుటను వివరించిరి. అదివిని రాజు
మిక్కిలి దుఃఖించెను. వారి బలపరాక్రమములు దివ్యాస్త్ర ప్రాప్తిని ప్రస్తావించెను. ఏకాంతమున జరిగిన వీరి సంభాషణమును విని శకుని దుర్యోధన కర్ణులకు వివరించెను. అదివిని దుర్యోధనుడు మిక్కిలి వ్యథచెందెను. అవకాశము చూసుకొని కర్ణశకునులు దుర్యోధనుని ప్రశంసిస్తూ అతనిని పాండవుల వద్దకు వెళ్ళుటకు ప్రేరేపించిరి. వారు దుర్యోధనునితో మహారాజ! రాజ్యలక్ష్మితో ఒప్పు నీవు పాండవుల వద్దకు వెళ్ళిన నీ ఐశ్వర్యమును చూచి వారు మిక్కిలి దుఃఖించెదరు. అందమైన చీరలతో, ఆభరణములతో అలంకృతమైన నీరాణులను చూచి నారబట్టల కట్టిన ద్రౌపది మిక్కిలి సంతాపమును బొందునని ఉత్సాహపరచిరి. వారి మాటలు దుర్యోధనునకు నచ్చెను. అతడు కర్ణునితో ద్వైత వనమునకు వెళ్ళుటకు తండ్రి అనుమతికై శకుని, దుశ్శాసనులతో సంప్రదించి ఉపాయమును అన్వేషించవలసినదని చెప్పెను. రేపు ఉదయము నేను మహారాజును కలిసెదనని దుర్యోధనుడు విశ్రాంతి గృహమునకు వెళ్ళెను. ఉదయము కర్ణుడు దుర్యోధనుని వద్దకు వచ్చి రాజా! గోవులు నివసించు ప్రదేశములన్నియు ద్వైతవనములోనే ఉన్నవి. కనుక ఘోషయాత్ర (గోస్థానములను చూచుట) వ్యాజంతో నిస్సందేహముగా మనము అక్కడికి వెళ్ళవచ్చునని తనకు తోచిన ఉపాయమును చెప్పెను. శకుని కూడా దానిని సమర్థించెను. ఇది బాగుందని అనుకొని దుర్యోధన, కర్ణ, శకునులు

మహారాజు వద్దకు వెళ్ళిరి.

ఘోషయాత్ర ప్రస్తావమును మొదట ధృతరాష్ట్రుడు తిరస్కరించెను. కాని శకుని ఒప్పించుటచే అనిష్టముగానే మహారాజు మంత్రులతో కూడా ద్వైతవనమునకు వెళ్ళుటకు దుర్యోధనుని అనుమతించెను. పరివారముతో కూడా దుర్యోధనుడు ద్వైతవనమునకు బయలుదేరెను.

దుర్యోధనుడు ససైన్యముగా ద్వైత వనమున గోశాలల వద్దకు వెళ్ళి అచ్చట తాత్కాలిక వాసము కొఱకు డేరాలను వేయించెను. పిమ్మట దుర్యోధనుడు ద్వైతవనమున సరోవరము దగ్గర క్రీడామంటపము నిర్మించమని సేవకుల నాదేశించెను. కాని సరోవరమును గంధర్వరాజు ఆక్రమించియుండెను. అది తెలిసికొని దుర్యోధనుడు గంధర్వులను పారద్రోలుమని సైనికులను ఆదేశించెను. కౌరవ గంధర్వుల మధ్య జరిగిన యుద్ధమున గంధర్వుల పరాక్రమము ముందు కౌరవసైన్యము నిలువ లేక పోయెను. కర్ణుడు కూడా ఓడి పారిపోయెను. గంధర్వరాజగు చిత్రసేనుడు దుర్యోధనుని బంధించగా కౌరవసైనికులు పాండవులను శరణు వేడిరి. దుర్యోధనుని విడిపించుటకు యుధిష్ఠిరుడు భీమసేనుని ఆదేశించెను. యుద్ధమున పాండవులు గంధర్వులను ఓడించి
దుర్యోధనుని విడిపించెను. దుర్యోధనుడు కర్ణునకు తన పరాజయమును వివరించి మనల్ని విడిపించుటకు యుధిష్ఠిరుడు సోదరులను ఆదేశించెనని చెప్పెను. అర్జునుడు కౌరవులను విడువమని స్వయముగా చిత్రసేనుని కోరెను. ఇదంతా తనకుకల్గిన అవమానముగా తలచి దుర్యోధనుడు ఆమరణము ఉపవాసము చేయుదునని దుశ్శాసనుని రాజ్యాభిషిక్తుని చేసె దనని తనయభిప్రాయము ప్రకటించెను. దుర్యోధనుని మాటలు విని దుశ్శాసనుడు ఉద్విగ్నుడై దుర్యోధనునికి ధైర్యము చెప్పెను. కర్ణుడు, శకుని ఇద్దరూ కూడా దుర్యోధనుని మనస్సు మార్చుటకు ప్రయత్నించిరి. కాని వారి మాటలను పెడ చెవిని బెట్టి దుర్యోధనుడు ఆమరణము ఉపవాస దీక్ష చేయుటకై నిశ్చయించుకొనెను.

పూర్వకాలమున దేవతల చేతిలో ఓడిన పాతాలవాసులగు రాక్షసులు దుర్యోధనుని తమవద్దకు రప్పించుకొనుటకు యజ్ఞము చేసెరి. యజ్ఞకుండము నుండి అద్భుతమగు స్వరూపము (కృత్య) ప్రకటితమాయెను. వారి ఆజ్ఞతో అది దుర్యోధనుని దగ్గరకు వెళ్ళి అతనిని పాతాళలోకమునకు తీసుకుపోయెను. దైత్యులు అనశన వ్రతమును

విరమించమని దుర్యోధనుని సముదాయించిరి. తిరిగి శక్తి స్వరూపము దుర్యోధనుని స్వస్థానమునకు చేర్చెను. దుర్యోధనుడు ఇందతయు కలయని తలచెను. పాండవులను జయించు విశ్వాసము అతనికి కల్గినది. తెల్లవారగనే తిరిగి కర్ణుడు దుర్యోధనుని వద్దకు వచ్చి అతనిని అనునయించెను. దైత్యుల మాటలను స్మరించి దుర్యోధనుడు పాండవులతో యుద్ధము చేయుటకు నిశ్చయించుకొనెను. తిరిగి అందరూ ద్వైతవనము నుండి హస్తినాపురమునకు వెడలిరి.

పాండవుల వలన గంధర్వుని నుండి బంధవిముక్తిని పొంది దుర్యోధనుడు హస్తినాపురమునకు తిరిగి వచ్చెను. భీష్ముడు దుర్యోధనుని దుష్టవ్యవహారమును నిందించుచు పాండవులతో సంధి చేసుకొమ్మని ఉపదేశించెను. అతని మాటలకు పరిహాసము చేసిన దుర్యోధనుడు శకునితో కలిసి వేరొక చోటుకు వెడలెను. దుర్యోధనుని అనుమతితో కర్ణుడు దిగ్విజయ యాత్రచేసి సంపదనంతయు హస్తినాపురమునకు చేర్చెను. కర్ణపురోహితుల సూచనననుసరించి దుర్యోధనుడు వైష్ణవ యజ్ఞము చేయ నిశ్చయించి పాండవులకు కూడా ఆహ్వానము పంపెను. వనవాస దీక్షలో నుండుటచే పాండవులు యజ్ఞమునకు రాలేక పోయిరి. కర్ణుడు అర్జునుని వధించెదనని ప్రతిజ్ఞ చేసెను. గూఢ చారుల ద్వారా అదివిని యుధిష్ఠిరుడు ఉద్విగ్నుడాయెను.

### 15) మృగస్వప్నోద్భవ పర్వము:-

ఈ ఉప పర్వమున ఒక్క అధ్యాయము మాత్రముగలదు. ఒక రోజురాత్రి నిద్రపోవుచున్న సమయమున యుధిష్ఠిరునికి స్వప్నమున ద్వైతవనములోని క్రూరమృగములు కనబడి అతనితో మీ వలన చంపబడుటచే మా జంతువుల సంఖ్య క్షీణించినది. మా రక్షణ కొఱకు మీరు మీ నివాస స్థానమును మార్చుకొనుడని విన్నవించుకొనినవి. నిద్రలో ధర్మరాజు వానికి అభయమిచ్చెను. ఉదయంకాగానే స్వప్నమునకు చలించిన ధర్మరాజు పరివారముతో గూడా ద్వైతవనము విడిచి కామ్యక వనమునకు వెడలెను.

### 16) వ్రీహిద్రౌణిక పర్వము:-

ఈ పర్వమున మూడు అధ్యాయములు గలవు. పాండవుల వనవాసమున పదకొండు సంవత్సరములు గడిచినవి. నా వలన కుటుంబమంతయు కష్టముల నను భవించు చున్నదని ఆలోచిస్తూ యుధిష్ఠిరుడు మథనపడసాగెను. ఒకరోజు వ్యాసమహర్షి పాండవులను చూచుటకు అచ్చటకు వచ్చెను. యుధిష్ఠిరుడు అడుగగా మహర్షి దానమే సర్వశ్రేష్ఠకర్మ. దానమునకు మించి కార్యము మరియొకటి లేదు. సత్పాత్రునికి పవిత్రభావంతో కొంత దానమిచ్చినను అది పరలోకమున అనంత ఫలమును కలుగజేయును. ముద్గల మహర్షి ద్రోణ పరిమాణము ధాన్యము దానము చేసి అనంత ఫలమును పొందెనని చెబుతూ ముద్గలోపాఖ్యానమును వినిపించెను. పిమ్మట పదమూడు సంవత్సరములు వనవాసము తరువాత పితృపైతామహ రాజ్యసంపదను తిరిగి పొందెదరని ఆశీర్వదించి వ్యాసమహర్షి తన ఆశ్రమమునకు వెడలెను.

### 17) ద్రౌపదీహరణ పర్వము:-

ఈ పర్వమున పది అధ్యాయములు కలవు. పాండవులు నగరమందు వలె వనమందు కూడా దాన ధర్మములతో జీవన యాత్ర సాగించుచున్నారని తెలుసుకొని దుర్యోధనుడు కర్ణ దుశ్శాసనులతో కలిసి కష్టములలో పడవేయు ఉపాయమును
ఆలోచించసాగెను. అదే సమయమున దుర్వాస మహర్షి తన పదివేల మంది శిష్యులతో అక్కడికి వచ్చెను. దుర్యోధనుని అతిథి మర్యాదలకు మిక్కిలి సంతోషించిన మహర్షి వరమును కోరు కొమ్మని అడిగెను. దుర్బుద్ధి అయిన దుర్యోధనుడు దుర్వాసుని తమ శిష్యులతో మీరు ఇదే విధంగా పాండవుల వద్దకూడా ఆతిథ్యం స్వీకరించ వలసిందని. ద్రౌపది సమస్త బ్రాహ్మణులకు భర్తలకు భోజనం పెట్టి తానుకూడా భుజించి విశ్రమించు సమయమున వెళ్ళ వలసినదని కోరెను. మహర్షి దుర్యోధనుని వచనమునకు అంగీకరించెను.

దుర్యోధనుని కోరిక ప్రకారం భోజనము పూర్తి అయి పాండవులు విశ్రమించు సమయమున దుర్వాస మహర్షి తన పదివేల శిష్యులతో యుధిష్ఠిరుని వద్దకు వెళ్ళెను. అతిథి పూజ అయిన తరువాత ధర్మరాజు

దుర్వాసునితో మహర్షీ! నిత్య కర్మలు పూర్తి చేసుకొని శీఘ్రముగా భోజనమునకు రావలసినదని విన్నవించెను. అక్షయ పాత్ర శక్తి ఆసమయమునకు పూర్తియగుటచే ఎట్లు అన్నము పెట్టవలెనా! అని ద్రౌపది చింతించసాగెను. ఆమె శ్రీకృష్ణ భగవానుని ప్రార్థించెను. శ్రీకృష్ణుడు అచ్చటకు వచ్చి నాకు ఆకలి వేయుచున్నది త్వరగా భోజనము సిద్ధము చేయుమని ద్రౌపదికి చెప్పెను. ద్రౌపది భగవంతుడా! నేను భోజనము చేయనంతవరకే సూర్య భగవానుడిచ్చిన అక్షయ పాత్ర నుండి భోజనము లభించును. కాని ఈరోజు నా భోజనము పూర్తి అయినది. అక్షయ పాత్ర నుండి అన్నము లభించదని ఆవేదన వ్య క్తము చేసెను. అంతట శ్రీకృష్ణుడు అక్షయ పాత్రను చూపించమని అడిగి ఆపాత్రయొక్క కంఠ దేశమున అంటుకొని యున్న అన్నకణమును తీసుకొని నోటిలో వేసుకొనెను. శ్రీహరి తృప్తుడైనచో సమస్త విశ్వము తృప్తి పడినట్టే అని చెప్పి శ్రీకృష్ణుడు మునులను భోజనమునకు పిలుచుకు రమ్మని సహదేవునికి చెప్పెను. కాని నదీ తీరమున మునులందరు అన్నరసముతో తృప్తిపడి ఆయాసపడు చుండిరి. దుర్వాసునితో సహా అందరూ ఋషులూ అచ్చటి నుండి వెళ్ళి పోయిరి. సహదేవుడు అంతయు యుధిష్ఠిరునికి నివేదించెను. శ్రీకృష్ణుడు జరిగినదంతయు చెప్పి వారి అనుమతితో ద్వారకకు వెడలెను. దుర్యోధనుని కుతంత్రము ఫలించలేదు.

ఒక సారి సింధు దేశపురాజు జయద్రథుడు వివాహము చేసుకొనవలెనను కోరికతో శాల్వదేశమునకు వెళుతూ కామ్యక వనమున ఆశ్రమమందు ఒంటరిగా నున్న ద్రౌపదిని చూచి కామమోహితుడై ఆమె పూర్వా పరములను విచారించుటకు కోటికాస్యుని పంపెను. ఆశ్రమమునకు విచ్చేసిన కోటికాస్యుని అతిథిగా తలచి ద్రౌపది ఆతిథ్యవ్యవస్థ యందు నిమగ్నమాయెను. కోటికాస్యుడు ద్రౌపదికి జయద్రథుని పరిచయము చేసెను. జయద్రథుడు తనమనస్సులో మాట చెప్పగా ద్రౌపది అచ్చటి నుండి తొలగి అతనిని హెచ్చరించెను. అతడు ద్రౌపదిని బలవంతముగా ఈడ్చుకొని వెళ్ళి రథముపై కూర్చుండబెట్టి తీసుకు పోయెను. ఆశ్రమమునకు తిరిగి వచ్చిన పాండవులు ద్రౌపదిని అపహరించిన వృత్తాంతము తెలుసుకొని జయద్రథుని వెంబడించిరి.

**18) జయద్రథ విమోక్షణ పర్వము:-**

ఇందు ఒక అధ్యాయము మాత్రము కలదు. భీముడు జయద్రథుని బంధించగా యుధిష్ఠిరుడు అతనిని విడిచి పెట్టెను. సిగ్గుపడిన జయద్రథుడు గంగాద్వారమునకు వెళ్ళి పరమేశ్వరుని శరణుగోరి తపస్సు చేసెను. పరమేశ్వరుడు ప్రత్యక్షముకాగా జయద్రథుడు పాండవులను యుద్ధమందు జయించునట్లు వరమడిగెను. భగవంతుడు అది అసాధ్యమని చెప్పి ఒక రోజు యుద్ధమున అర్జునుని విడిచి మిగిలిన పాండవులను యుద్ధరంగమున ముందుకు వెళ్ళనీయకుండా నిలుపు చేయగలవని వరమిచ్చి అంతర్ధానమాయెను.

**19) రామోపాఖ్యాన పర్వము:-**

ఈ ఉపపర్వమున ఇరువది అధ్యాయములు కలవు. జయద్రథుని జయించి ద్రౌపదిని విడిపించి తీసుకు వచ్చిన పిమ్మట తన దురవస్థకు విచారించిన యుధిష్ఠిరుడు మునిగణముతో కూర్చొని యున్న మార్కండేయ మహర్షిని హే భగవన్! మీరు త్రికాలజ్ఞులు , నావంటి భాగ్యహీనుడు ఈ లోకమున మరియొకడున్నాడేమో మీరే చెప్పండని అడిగెను. ఇదివిని మార్కండేయుడు శ్రీరామచంద్రుని వృత్తాంతము వినిపించెను. శ్రీరామాదులజన్మ, రావణాదుల ఉత్తత్తి, శ్రీరామునికి రాజ్యాభిషేక సన్నాహము, రామ వనగమనము, మారీచవధ, సీతాపహరణము, రామరావణ యుద్ధము, రావణ సంహారము, శ్రీరామ రాజ్యాభిషేకము మున్నగు ఘట్టములను వర్ణించి శ్రీరాముని కష్టముల ముందు నీ కష్టములెంతయని చెప్పి యుధిష్ఠిరునికి ధైర్యము చెప్పెను.

**20) పతివ్రతామాహాత్మ్య పర్వము:-**

ఇందు ఏడు అధ్యాయములు గలవు. యుధిష్ఠిరుడు మార్కండేయుని మహర్షీ! ద్రౌపది వంటి పతివ్రత, సౌభాగ్యవతి యగు స్త్రీని మీరు చూచితిరా? లేక వింటిరా? అని ప్రశ్నించెను. సమాధానముగా

మార్కండేయుడు సావిత్రి ఉపాఖ్యానమును వినిపించెను. రాజు అశ్వపతి సంతానము కొఱకు కఠోరనియమములు పాటించుచుండెను. ప్రసన్నురాలైన సావిత్రీదేవి వరదానముచే అతనికి పుత్రిక జన్మించెను. అతని పేరు సావిత్రి. యౌవనవతి అయిన ఆమె తండ్రి ఆదేశానుసారము భర్తను అన్వేషించుటకు దేశములన్నియు తిరిగి మరల స్వదేశమునకు వచ్చెను. ఆమె తన తండ్రితో శాల్వదేశవాసియగు ద్యుమత్సేనుని పుత్రుడగు సత్యవంతుని నేను భర్తగా ఎంచుకొంటినని చెప్పెను. ఇదివిని అక్కడ ఉన్న నారద మహర్షి, తెలియకుండానే సావిత్రి అనిష్టమాచరించినది. ఈరోజు నుండి ఒక సంవత్సరము వరకు సత్యవంతుని ఆయుర్దాయము మిగిలియున్నది. అని చెప్పెను. తండ్రి మరియొకనిని భర్తగా వరించమని తనకూతురుకు సలహా ఇచ్చెను. కాని సావిత్రి నేను అతనిని భర్తగా వరించితిని. కన్య ఒక్కసారి మాత్రమే ఈయబడుతుంది. కనుక అతనినే వివాహము చేసుకొందునని చెప్పి తండ్రి మాటలను తిరస్కరించెను. నారదుని సలహామేరకు అశ్వపతి తన కూతురు కోరిక ప్రకారము సత్యవంతునితో ఆమె వివాహము జరిపించెను. సావిత్రి తన సేవలతో అత్తమామలు మున్నగు వారిని తృప్తిపరచుచుండెడిది.

సంవత్సరము పూర్తి అగుచుండుటవలన సత్యవంతుని మరణకాలము ఆసన్నమైనది. నేటినుండి నాల్గవ రోజున తనభర్త ఆయుర్దాయము తీరిపోవునని నిశ్చయించుకొని సావిత్రి మూడు రాత్రుల వ్రతమును పాటించెను. రాత్రింబవళ్ళు నిలబడియే యుండెను. రేపే పతి దేవుని మరణమని తెలుసుకొని సావిత్రి మిక్కిలి దుఃఖించెను. సత్యవంతుడు కట్టెలు కొట్టి తెచ్చుటకు వనమునకు వెళ్ళెను. అత్తమామల అనుమతి తీసుకొని సావిత్రి భర్తను అనుసరించెను. కట్టెలు కొట్టుటచే తలలో చెప్పలేనంత బాధగానున్నది నిద్రపోయెదనని సత్యవంతుడు చెప్పెను. సావిత్రి తన భర్త శిరస్సును ఒడిలో పెట్టుకొనెను. ఇంతలో యమధర్మరాజు ప్రత్యక్షమై నీ భర్త ఆయుర్దాయము తీరినది. నేను తీసుకుని వెళ్ళెదనని ఆమెతో చెప్పెను. వారిద్దరి మధ్య వివాదము జరిగెను. చివరకు ప్రసన్నుడైన యమధర్మరాజు భర్త ప్రాణములు మినహా మరియేదైన వరము కోరు కొమ్మని చెప్పెను. వరము అడుగు క్రమములో నాల్గవ
వరంగా నూర్గురు పుత్రులను సంతతిగా కోరెను. యమధర్మరాజు తథాస్తు

అని వరమిచ్చెను. దాంపత్యసమాగమము లేకుండా సంతతి అసాధ్యము కనుక నాభర్తను బ్రతికించమని వేడుకొనెను. యమధర్మరాజు ప్రసన్నుడాయెను. సత్యవంతుడు తిరిగి బ్రతికెను.

శాల్వ దేశప్రజల కోరిక ననుసరించి ద్యుమత్సేనుడు రాజ్యాభిషిక్తుడాయెను. సత్యవంతుడు యువరాజు ఆయెను. ఈ విధముగా మార్కండేయ మహర్షి ధర్మరాజునకు సావిత్రి ఉపాఖ్యానమును చెప్పెను.

**21) కుండలాహరణ పర్వము:-**

ఈ పర్వమున పది అధ్యాయములు గలవు. పాండవుల వనవాసము పండ్రెడు సంవత్సరములు పూర్తి అయి పదమూడవ సంవత్సరము ప్రారంభమాయెను. పాండవ పక్షపాతియగు ఇంద్రుడు కర్ణుని కవచకుండలములు యాచించుటకు సిద్ధపడెను. ఇంద్రుని మనోభావము తెలుసుకొని సూర్యుడు స్వప్నమున కర్ణునికి కనిపించి ఇంద్రునికి కవచకుండలములు ఈయవద్దని హెచ్చరించెను. కాని కర్ణుడు సూర్య భగవానుని వచనమంగీకరించలేదు. బ్రాహ్మణ వేషధారియగు కర్ణునకు కవచకుండలములు ఇచ్చి ఉత్తమగతిని పొందుటకు నిశ్చయించెను. కలపూర్తియయిన వెంటనే నిద్రలేచిన కర్ణుడు స్వప్నమును మననము చేస్తూ ఇంద్రుని నుండి శక్తిని గ్రహించి కవచకుండలములు ఇచ్చుట నిర్ణయించుకొనెను. బ్రాహ్మణ వేషధారియగు ఇంద్రునితో తన అమోఘమైన శక్తిని ఇచ్చి కవచకుండలములను తీసుకొమ్మని చెప్పెను. అప్పుడు ఇంద్రుడు రెండు క్షణములు ఆలోచించి అతనితో కవచకుండలములు నాకిచ్చి నాయీ శక్తిని గ్రహింపుము. నీదగ్గరకు వచ్చిన తరువాత ఈ శక్తి ఎవరో ఒక ప్రతాపవంతుడైన శత్రువును చంపి తిరిగి నా వద్దకు వచ్చునని చెప్పి కవచకుండలములకు బదులుగా తన శక్తిని కర్ణునకిచ్చెను.

**22.ఆరణేయ పర్వము:-**

ఈ ఉపపర్వమున అయిదు అధ్యాయములు గలవు. ద్రౌపదిని హరించిన జయద్రథుని యుద్ధమందు ఓడించి పాండవులు తిరిగి ద్రౌపదిని

పొంది పిమ్మట వారు  కామ్యకవనము విడిచి ద్వైతవనమునకు వెళ్ళిరి. ఒక రోజున ఒక తపస్వి బ్రాహ్మణుని
అరణితో కూడిన మంథన కాష్ఠము లేడి కొమ్ములలో ఇరుక్కు పోయెను. బ్రాహ్మణుని ప్రార్థననుసరించి పాండవులు మంథన కాష్ఠమును తీసుకు వచ్చుటకు మృగమును అనుసరించిరి. వెంబడించినను ఫలితము లేక అలసిన పాండవులు ఒక చెట్టునీడన కూర్చొనిరి. యుధిష్ఠిరుని ఆదేశానుసారము నీళ్ళు తీసుకొని వచ్చుటకు నకులుడు సరోవరమునకు వెళ్ళి అక్కడ యక్షుడు అడిగిన ప్రశ్నలకు సమాధానము చెప్పక అవహేలన చేసి సరోవరములోని నీళ్ళుత్రాగి తెలివి తప్పి పడిపోయెను. అతనిని వెదకుచు వెళ్ళిన సహదేవ,అర్జున,భీములు, కూడా అచ్చటి నీళ్ళనుత్రాగి మూర్ఛపోయిరి. చివరకు ధర్మరాజు యక్ష ప్రశ్నలకు సరైనసమాధానము చెప్పెను. సంతుష్టుడైన యక్షుడు ధర్మరాజు నల్గురు సోదరులు పునరుజ్జీవితులగునట్లు వరమిచ్చెను.

పదమూడవ సంవత్సరమున అజ్ఞాత వాసము చేయుటకు పాండవులు బ్రాహ్మణులనుండి అనుజ్ఞను పొంది ద్రౌపదితో సహా ధౌమ్యునితో కలిసి అచ్చటినుండి వెడలిరి.

**ఇది వనపర్వ కథాంశము.**